# రంగుల బొమ్మ

ప్లీడరుగా రమ్మాయి 'లలిత' దగ్గరున్న బొమ్మ చాలా చక్కగా, అందంగా వుంది. ఆ బొమ్మను పంతులుగా రమ్మాయి, విమల చూసి మురిసిపోయింది. ఇంత చక్కని బొమ్మ అస లెక్కడయినా వుంటుందా? బజారులో దొరుకు తుందా? దాని వెలేం ఎక్కువగా వుండదు! మహా వుంటే రెండు రూపాయ లుండొచ్చు. నాన్నకు రెండు రూపాయలేం ఒక లెక్కా! నాలుగో తేదీ చూడాలి నాన్న దగ్గర నోట్లు? ఎన్ని వుంటాయని. బోలె డన్ని నోట్లు! తను ఎప్పుడూ లెక్క పెట్టి చూడలేదు, నాన్నను అడగ లేదు గానీ, కనీసం ఏ నలభై ఏభై నోట్లయినా వుంటాయి. అమ్మో నలభై, ఏభై నోట్లంటే, యేం సామాన్యమా! అబ్బో! ఇంటి నిండుకు బొమ్మలొచ్చునే! చక్కని బొమ్మలు! అందమయిన బొమ్మలు. ముచ్చటయిన ముద్దొచ్చే బొమ్మలు. రంగురంగుల గమ్మత్తయిన, మజా అయిన బొమ్మలు.

పోయిన యేడు ప్లీడరుగారింట్లో బొమ్మలకొలువుకు వెళ్లింది తను. ఆహా! అది భూలోక స్వర్గం. ఆ రోజు తనకు ఎప్పటికీ అక్కడే, ఆ బొమ్మల కొలువులో, తనూ ఒక బొమ్మయి వుండిపోవాలనిపించింది.

**రాజేంద్ర**

కాని అమ్మ ఈడ్చుకువచ్చేసింది. ఆ బొమ్మల కొలువు ఇప్పటికీ కళ్ళ ముందు కనిపిస్తూనే వుంది. ఇప్పుడు కొత్తగా లలిత ఎక్కడినుంచో, ఒక బొమ్మ తెప్పించుకొంది. లోకం లోని బొమ్మలన్నీ ఒక యెత్తూ, ఈ ఒక బొమ్మే ఒక యెత్తుగా వుంది. లలిత నాన్నను పిసినిగొట్టంటారే గానీ, ఆ అనేవాళ్ళే చెడ్డవారు. ఆయనకు పిల్లలంటే ఎంత అభిమానమని. లలితకేం కావలసినా, నిముషాలమీద తెచ్చియిస్తారు. తన్ను చూస్తేకూడా నవ్వుతూ మాట్లాడుతాడు.

"బాగా చదువుకో విమలా! నువ్వూ, మా లలితా యిద్దరూ చక్కా చదువుకొని గొప్పవాళ్లయి పోవాలి ఏం..." అంటా రాయన! ఎంత మంచివా రాయన!

నాన్న ఎంతసేపయినా ఉట్టి మాటలే మాట్లాడుతాడు. ఎప్పుడూ ఒక మంచి బొమ్మ కొని యిచ్చింది లేదు. చెత్తచెత్త పాడుబొమ్మలన్నీ తెస్తాడు. 'వద్దో' అంటే వాటిని తెచ్చి పడేస్తాడు. ఈ సారి నాన్న లలితకున్న బొమ్మలాంటిది గాని తెచ్చియివ్వకపోతే నాన్న జుట్టు పీకి పారేయాలి. గడ్డం గీకి, పొడి చేయాలి. చంపేయాలి, అనుకొంటూ లలిత ఇంటినుంచి జోరుగా నడచి ఇల్లు చేరుకొంది-విమల.

అప్పుడే నాన్నగారు ఇంటికి వచ్చారు.

"నాన్నా నాన్నా! లలిత దగ్గర ఒక బొమ్మ వుంది నాన్నా! ఎంత బావుందని నాన్నా! నాకూ అలాంటి బొమ్మ కావాలి నాన్నా! నాన్నా అలాంటిబొమ్మ నాకూ ఒకటి కొనివ్వవూ?" అని విమల, ఆయన చేతులు పట్టుకొంది. "దానికేం. కొనుక్కుందాంలే విమలా. ఆ బొమ్మ ఎలాంటిదో చూపించు. తర్వాత చూద్దాం" అన్నా రాయన.

"చూడాలా నాన్నా. అయితే వుండు. ఇప్పుడే తెస్తాను" అని పరుగు తీసింది.

"ఇప్పుడే తొందరేమిటి. తర్వాత వెడుదువులే" అని ఆయన అంటున్నా విమల వినిపించుకోలేదు


**తెలుగు ఆంగ్ల భాషాబోధిని**




తెలుగు చదువ తెలిసినవారెల్లరు ఈ పుస్తకంతో ఇతరుల సహాయం లేకనే ఇంగ్లీషుభాష సులభంగా చదువను, వ్రాయను, మాట్లాడను, ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం నేర్చుకోవచ్చును. ఒక పెద్దక్యాలికో బైండు పుస్తకం రు. 5/- వి. పి.పి రు. 1-2-0.

**కొక్కోకము:** ఇది అసలైన కొక్కోక గ్రంథము. ఫోటోలతో వున్నది— రు. 1/- వి. పి. రు. 0 12-0.

Vani Book Depot. P. B. No. 239, Madras 1.

మరికొన్ని నిముషాల కాలంలో, లలిత, విమల, బొమ్మతో ఇంటికి వచ్చారు. విమల నాన్న, పంతులు గారు ఆ బొమ్మను చూశారు. మొదట ఆయన ఆ బొమ్మను, ఒక కళాభిమానిదృష్టితో చూసి 'చక్కనిబొమ్మ' అనుకొన్నాడు. తర్వాత డబ్బు దృష్టితో చూశారు. ఆలోచించి చూస్తే, దాని ఖరీదు ఎలా లేదన్నా ఏడెనిమిది రూపాయలయినా వుంటుందనిపించింది. అబ్బ! ఏడెనిమిది రూపాయలు! ఆ డబ్బు వుంటే ఎంత బియ్యం వస్తుంది? ఎన్ని రోజులకు, కూరగాయలు పాలు మజ్జిగ ఖర్చులకు వస్తుంది? ఎన్నిరోజులు, నశ్యానికి వస్తుంది? ఊహూ...ఇది తన శక్తికి మించిన ఖరీదయిన బొమ్మ! అయితే కుమార్తెను సంతృప్తిపరచడమెట్లా? విమల తను ఎంత చెప్పినా, బొమ్మ యివ్వనిది మాటలతో, ఇతర చిన్న చిన్న లంచాలతో, దారికి రాదని ఆయనకు తెలుసు. అయినా దానివెల తెలుసుకొని తర్వాత చూద్దామనుకొన్నారు.

"అమ్మా లలితా, దీని వెలెంతో తెలుసా?" అని అడిగారు పంతులుగారు.

"పదిరూపాయలని మా నాన్న చెప్పాడు మేష్టారూ" అంది లలిత. ఆ మాట వినేసరికి పంతులుగారు విస్మయపడలేదు గానీ, ఇక తను తపస్సు చేసినా, 'పదిరూపాయలు పెట్టి అలాంటి బొమ్మను విమలకు కొనిపెట్టలేనుగదా' అని విచారించారు. లలిత చేతిలోని ఆ బొమ్మను తన చేతికి తీసుకొని అటూ ఇటూ త్రిప్పిచూశారు. 'పదిరూపాయలే కావచ్చు దీనివెల' అనుకొన్నారు.

"సరే లేమ్మా. చూస్తాంలే. వెళ్లి ఇద్దరూ భోజనం చేయండి" అని బొమ్మను లలిత కందిచ్చారు.

"వస్తా విమలా...రేపు తెల్లవారే వస్తాన్లే" అని లలిత వెళ్లిపోయింది.

"నాన్నా తప్పకుండా కొనివ్వాలి" అంది విమల.

"అలాగే చూద్దాంలే" అన్నారాయన. అంతకన్న ఇక ఏమనగలరాయన?

కొన్ని రోజులు గడిచాయి. విమల రోజూ బొమ్మకోసం అడుగుతూనే వుంది. పంతులుగారు ఎప్పటికప్పుడు విమలకు సర్ది చెబుతూనే వున్నారు. ఇక యిలా మెత్తగా అడుగుతూవుంటే ఫలితం వుండదని, విమల ఇప్పుడు కొంత పట్టుదలగా, గట్టిగా అడుగసాగింది.

"ఏమయినా సరే నాన్నా. నాకు బొమ్మ కావాలి నాన్నా! నాన్నా బొమ్మ నాన్నా! బొమ్మా!"

ఇలా రోజూ, ఆయన ఇంట్లో వున్నప్పుడల్లా, అడుగుతూ ఏడువసాగింది విమల.

పంతులుగారి కేమి చెప్పడానికీ తోచకపోయింది. "తెస్తాను...రేపు తెస్తాను..." అనే పాతపాట ఇక, ఆమెకు తృప్తినివ్వదని తెలిపోయింది. మాటల్లో ఎంత కొత్తదనం చూపించినప్పటికి గూడా, విమల తన్ను నమ్మదు. అయితే ఇక ఎట్లా చేయడం. ఏదోవిధంగా అమ్మాయికి బొమ్మ తెచ్చిపెట్టక తప్పదు. ఇదివరకెన్నోమారులు ఇలా తెస్తాను తెస్తానని చెబుతూ, చివరికి చల్లని మాటలతో ఎలాగో మరిపింపజేసేవాడు. ఈసారిమటుకు విమల ఏవిధంగానూ ఆ 'బొమ్మ' విషయం మరచిపోయేలా లేదు.

"నాన్నా! నాకు రేపు పండుగ


నిగనిగలాడు దీర్ఘ కుంతలాలు పెరుగుటకు



కేశవర్ధని

వాడండి.



తలలో దురదను, కురుపులను మాన్పుంది వెంట్రుకలు రాలుట ఆపండి కేశాలను అకాలంలో నెరియనివ్వకండి.

నెరియటం ఆలస్యం కానివ్వండి. నిగనిగలాడు పొడుగైన కుంతలాలు పొందండి.

కేశవర్ధని వాడి, మీ కేశ సౌందర్య శోభ ప్రదర్శించండి.

షాంపూ వాడి, కేశశుభ్రత, సువాసన పొందండి.

కేశవర్ధని అ. 14, షాంపూ అ. 14, పోస్టేజి అదనం అన్ని చోట్లా లభించును.

కేశవర్ధని ప్రొడక్ట్సు, కోయంబత్తూరు.

నేషనల్ పేబ్లిసిటీ సర్వీసెస్ (సదరన్) లిమిటెడ్, బకింగ్‌హాంపేట, బెజవాడ No. 6

# ★ రంగుల బొమ్మ ★

నాటికి బొమ్మ తెచ్చియివ్వాలి నాన్నా! లేకపోతే అన్నం తినను, స్నానం చెయ్యను, స్కూలుకు రాను...ఏమీ చెయ్యను...బొమ్మ నాన్నా! నాకు బొమ్మ...బొమ్మ నాన్నా! బొమ్మా!" అందొకరోజు విమల కుక్కిమంచంమీద కూర్చునివున్న నాన్నతో.

పంతులుగారు ఐదు నిముషాలు ఆలోచించారు.

"ఏమమ్మా! బొమ్మ కదూ నీకు కావలసింది. సరే! ఎప్పుడు కావాలి...పండగనాటికి కదూ! సరే తప్పకుండా తెచ్చియిస్తాను" అని మాట యిచ్చారు. ఆ మాట ఆ అమ్మాయి నమ్మి వెళ్ళిపోయింది.

ఆరోజునుంచీ పంతులుగారు కార్యక్రమం మొదలెట్టారు. బజారుకు వెళ్ళి, బొమ్మ తయారు చేయడానికి కావలసిన పరికరాలంతా తెచ్చుకొన్నారు. రోజూ రాత్రి తన గదిలో దీపం పెట్టించుకొని, ఒక చక్కని బొమ్మను తయారు చేయాలనే సంకల్పంతో, ఏదో చేస్తూవుండిపోయారు. ఎంతో కష్టపడి చివరికా పండుగనాటికి ఒకబొమ్మను తయారుచేయగలిగారు. నిజానికదేమంత చక్కగా, ఆకర్షణీయంగా లేదనిపించింది. అయినా విమల దగ్గర ఇచ్చిచూడ్దామనుకొన్నారు.

పండుగనాడు ఉదయం విమలను గదిలోకి పిలిచి -

"ఇదిగో. బొమ్మ తెచ్చాను చూడు. బాగుందా" అని అందిచ్చారు. ఏమి చెప్తుందోనని ఆతృతతో విమల ముఖంలోకి చూశారు. విమల ముఖం వికసించింది.

"బలే బొమ్మ నాన్నా! రంగుల బొమ్మ! పెద్ద బొమ్మ! బలేబొమ్మ!" అంటూ బొమ్మతో తుళ్ళుతుంది పంతులుగారప్పుడు పొందిన ఆనందాన్ని వర్ణించలేము. కొలంబస్, ఇండియాను కనుగొన్నానని అనుకొన్నప్పుడు కూడా అంతటి ఆనందాన్ని పొందివుండడు.


విమల 'బొమ్మ'తో లలిత ఇంటికి వెళ్ళింది. ఆ రంగు రంగుల, చిత్రమయిన పెద్ద బొమ్మను చూసేటప్పటికి, లలిత; పరుగున వచ్చి "ఆహా...ఏం బావుందీ బొమ్మ! ఎక్కడిది విమలా! బలే బావుందీ బొమ్మ! నేనూ మా నాన్నను తెమ్మనాలి" అంది. విమల సంతోషంతో పొంగిపోయింది. ఇంతలో అక్కడికి లలిత నాన్న ప్లీడరుగారు వచ్చారు. లలిత అన్నమాటల్ని విన్నారు.

ఎక్కడ తెచ్చారమ్మా ఈ బొమ్మ! చాలా బాగుందే! ఇలాంటి బొమ్మలు మనవూళ్లో దొరకవే! డబ్బిస్తాను. మీ నాన్నగారినే ఒకటి తెప్పించమనాలి, ఏమమ్మ విమలా...తెప్పించమంటావూ?" అని విమల నడిగారాయన. అప్పుడే వెంటనే లోనికెళ్లి వచ్చారు.

"ఇదిగో...పదిహేను రూపాయలిస్తాను. ఆయనదగ్గరిచ్చి తెప్పించమనమ్మా! ఈ బొమ్మ అంతకు తక్కువ ఖరీదుకు రాదులే, అమ్మాయ్ లలితా నువ్వూ వెళ్లి. పంతులుగారి దగ్గర ఈ డబ్బు యిచ్చి చెప్పిరా! నేను చెప్పానని చెప్పు" అన్నారు ప్లీడరుగారు.

పండుగపూట స్నానమయినా చేయకుండా వచ్చేసిందే, పిలుచుకపోదామని. అప్పుడే అక్కడికొస్తున్న పంతులుగారు, ప్లీడరుగారిమాటలు విని విస్తుపోయి అక్కడే నిల్చుండిపోయారు! ★


దాంపత్య రహస్యములు
ఇది పటములతో 254 పుటలు పటాలతో రు. 3/-
కామకళారంగం అనే కోక్కోకం పటాలతో రు. 1/8
కామకళా లేక కోక్కోకము పటములతో వెల 1/-
మూడుసుకొన్నచో పోస్టుఖర్చు రు1/-వ్రాయండి
D. కె. మిత్రా & కో. 26 బీట్ పొకారుపేట. మద్రాసు.


ఆంధ్రరాష్ట్రమునకు ఏజెంట్లు: శ్రీరాం జనరల్ స్టోర్సు ఏజెన్సీస్, విజయవాడ.